
రీజనల్ రింగ్ రోడ్డు మ్యాప్

ట్రిబుల్‌ఆర్‌పై ముందడుగు

- ఉత్తర భాగం భూసేకరణ వేగవంతం చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- భూసేకరణ పూర్తయితే పెరగనున్న రియల్ భూం

గజ్వేల్, జనవరి 17: ట్రిబుల్‌ఆర్(రీజనల్ రింగ్‌రోడ్డు)పై మరో ముందడుగు పడింది. ఉత్తరభాగం భూసేకరణను పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడం, భూసేకరణకు అయ్యే ఖర్చుతో పాటు రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అయ్యే రాష్ట్ర వాటాను పూర్తిస్థాయిలో అందిస్తామని ప్రకటించడంతో ఒక్కసారిగా రీజనల్ రింగ్‌రోడ్డుపై కదలిక వచ్చింది. ఉమ్మడి మెదక్, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ఉత్తర భాగం నిర్మాణం జరుగుతుండగా సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, నల్గొండ జిల్లాల పరిధిలో దాదాపుగా 158.64 కిలోమీటర్ల మేర ఈ రీజనల్ రింగ్‌రోడ్డును ప్రతిపాదించారు. ఆయా జిల్లాల్లోని 20 మండలాలు, 111 గ్రామాల మీదుగా ఈ రీజనల్ రింగ్‌రోడ్డు వెళ్లనున్నది. భూపరిహారానికి రూ.5,200 కోట్లు, రోడ్డు నిర్మాణానికి రూ.8,600 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు. సిద్దిపేట జిల్లా పరిధిలో గజ్వేల్ డివిజన్‌లోనే ఈ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. రాయపోల్, వర్గల్, గజ్వేల్, మర్కుక్, జగదేవ్‌పూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి 31.743 కిలోమీటర్ల మేర రీజనల్ రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. సిద్దిపేట జిల్లా పరిధిలో దాదాపు 980 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. ఇప్పటికే భూసర్వే పూర్తి చేయడంతో పాటు హద్దులను ఏర్పాటు చేశారు.

భూముల ధరలకు మరోసారి రెక్కలు

రీజనల్ రింగ్ రోడ్డు భూసేకరణ పూర్తయితే ఇప్పటి వరకు స్థిరంగా ఉన్న భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చే అవకాశాలు ఉన్నాయి. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల పరిధిలోని సంగారెడ్డి, నర్సాపూర్, గజ్వేల్ డివిజన్లలో భూముల ధరలు ఆకాశానికి తాకే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఈ మూడు డివిజన్లలో భూముల ధరలు భారీగా ఉండడం, ఇటీవల స్థిరాస్తి వ్యాపారం మందగించడం, ఎన్నికల కోడ్ ఇతరత్రా కారణాలతో భూములపై పెట్టుబడి పెట్టేందుకు పెద్దగా ఆసక్తిని చూపలేదు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో భూముల ధరలకు మరోసారి రెక్కలు వచ్చే అవకాశాలున్నాయి. కొన్నాళ్లుగా వ్యాపారం లేక దిగాలుగా ఉన్న వ్యాపారులకు కలిసి వచ్చే అవకాశం ఉంది.

భూయజమానుల్లో మొదలైన కలవరం

రీజనల్ రింగ్ రోడ్డు భూములకు ఇప్పటికే సర్వే పూర్తి చేయడం, హద్దులను ఏర్పాటు చేయడంతో సదరు భూయజమానుల్లో ఆందోళన మొదలైంది. గత కొన్నాళ్లుగా రీజనల్ రింగ్‌రోడ్డు అంశంపై ఉలుకు పలుకు లేకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకోగా, తాజాగా సీఎం ప్రకటనతో రైతుల్లో కలవరం మొదలైంది. ముఖ్యంగా నష్టపరిహారం విషయంలో రైతులు దిగాలు చెందుతున్నారు. గతంలో మాదిరిగా కాకుండా న్యాయ సమ్మతమైన ధరను చెల్లించాలని పలువురు కోరుతుండగా, భూమికి భూమి అయినా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని, ఫారెస్ట్ మీదుగా రైతులకు నష్టం కలగకుండా చేపట్టాలని పలువురు కోరుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఊపు తీసుకురాగా, రైతుల్లో మాత్రం కలవరం మొదలైందని చెప్పవచ్చు.


అధికారులు ఏర్పాటు చేసిన హద్దులు


గెస్ట్‌హౌజ్-1లో పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన భవనం

కొమురవెల్లి మల్లన్న భక్తులు సరైన బస లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ పరిధిలో ఉన్న నామమాత్రపు గదులను ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. పెచ్చులూడి, చిన్నపాటి వర్షం కురిసినా ఉరుస్తున్నాయి. ఆ గదులు ప్రమాదకరంగా మారినప్పటికీ భక్తులు తప్పనిసరి పరిస్థితుల్లో బస చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. నిర్ణీత రుసుము చెల్లించినప్పటికీ పలు గదుల్లో సరైన కుర్చీలు లేవు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగా ఉండడం లేదు.

శిథిలావస్థలో..

కొమురవెల్లి మల్లన్న ఆలయ వసతి గదులు

- రూ.17 కోట్ల వ్యయంతో మూడంతస్తుల్లో 63 గదుల నూతన నిర్మాణానికి గతంలో ప్రతిపాదన
- నిధుల మంజూరులో దేవాదాయశాఖ జాప్యం
- ప్రైవేటు భవనాల్లో రూ.వేలల్లో అద్దె
- ఆరుబయట టెంట్లు వేసుకుని భక్తుల బస
- ఏటా భక్తులకు తప్పని ఇబ్బందులు

చేర్యాల, జనవరి 17 : కొమురవెల్లి మల్లన్న దర్శనానికి వచ్చిన భక్తులు బస చేసేందుకు సరైన వసతి లేకపోవడం, ఉన్న భవనాలు కాస్తా శిథిలావస్థకు చేరడంతో ప్రయివేటు గదులను ఆశ్రయిస్తున్నారు. చిన్నపాటి గదిని వేలాదిరూపాయలకు అద్దెకు తీసుకుంటున్నారు. ఆర్థికస్థోమత లేనివారు ఆరుబయట బహిరంగ ప్రదేశాల్లో ఉండి టార్పాలిన్‌షీట్లతో గుడారం ఏర్పాటు చేసుకుని తలదాచుకుంటున్నారు.


లక్షల్లో భక్తులు.. గదులు 147 మాత్రమే

మల్లన్న ఆలయంలో ఏటా మూడునెలల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాలకు సుమారు 10లక్షల మంది భక్తులు తరలివస్తుంటారు. ప్రభుత్వం తరఫున గదులు ఏమీలేవు. 140పై గదులు దాతలు నిర్మించి విరాళంగా ఇచ్చినవే. వాటిని మల్లికార్జునస్వామి, మేడలమ్మ, కేతలమ్మల పేరిట బ్లాకుల వారీగా కేటాయించారు. మేడలమ్మ బ్లాకులో 50, మల్లికార్జునస్వామి బ్లాకులో 21, కేతలమ్మ బ్లాకులో 76 చొప్పున గదులున్నాయి. వీటిలో మల్లికార్జునస్వామి బ్లాకులోని కొన్ని గదులను వస్తు, సామగ్రి నిల్వకు వినియోగిస్తున్నారు. మరికొన్ని గదులు శిథిలావస్థలో ప్రమాదకరంగా మారాయి. వాటిని ఎవరికీ ఇవ్వడం లేదు.

63 గదుల నిర్మాణానికి ప్రతిపాదించినా..

ఆలయ ఆధ్వర్యంలో సుమారు రూ.14కోట్లతో ఐదేళ్లక్రితం చేపట్టిన 50 గదుల సత్రం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో ఈ ఏడాది కూడా అందుబాటులోకి రాలేదు. నిర్మాణం పూర్తయిన శివసదనం 16 గదులను ప్రారంభించకపోవడంతో భక్తులకు దోహదపడటం లేదు. కాగా ఆలయ యూ-బిల్డింగ్ ఎదురుగా ఎండీఎస్-బ్లాక్‌లోని 19గదులు శిథిలావస్థలో ఉన్నందున వాటిని కూల్చి డోనర్ స్కీం ద్వారా 63 గదులను నిర్మించాలని కొన్నాళ్లక్రితం నిర్ణయించారు. అందుకు రూ.17కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. దాతలకు అవకాశం కల్పించేందుకు ఒక్కో గది నిర్మాణానికి రూ.27లక్షల చొప్పున వ్యయం కానుందని నిర్ధారించారు. ఈవిషయమై పలువురు దాతలు సిద్ధంగా ఉన్నప్పటికీ దేవాదాయశాఖ నిధులు మంజూరు చేయక పోవడంతో కార్యరూపం దాల్చడంలేదు.


టార్పాలిన్ షీట్లతో గుడారం ఏర్పాటు చేసుకున్న భక్తులు


శిథిలావస్థలో ఉన్న గదులు

గెస్ట్‌హౌజ్-1ను పరిశీలించిన మంత్రి సురేఖ

ఆలయానికి వచ్చే ఉన్నతస్థాయి అధికారి, ప్రధాన ప్రజాప్రతినిధులకు నంబర్-1 గెస్ట్ హౌజ్‌ను కేటాయిస్తున్నారు. వీటిని చాన్నాళ్ల క్రితం నిర్మించడంతో గెస్ట్‌హౌజ్‌లోని పలు గదులలో పెచ్చులూడాయి. హాల్‌పక్కన గల ఓ గది పైకప్పు పూర్తిగా ధ్వంసమై ఇనుప చువ్వలు బయటకు తేలి ప్రమాదకరస్థితిలో ఉంది. ఇటీవల మల్లన్న కల్యాణానికి పట్టువస్త్రాలను తీసుకువచ్చిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సంబంధిత గది ప్రమాదకర పరిస్థితిని పరిశీలించారు. ప్రత్యామ్నాయచర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ కమిషనర్‌కు సూచించారు.

పట్నం వారానికి అప్పుడే అడ్వాన్స్ బుకింగ్

వచ్చే ఆదివారం నుంచి ప్రారంభం కానున్న జాతర ఏప్రిల్ 8న ముగుస్తుంది. మొదటి వారానికి సంబంధించి ఆలయపరిధిలోని ఆయా గదులను డోనర్లకే కేటాయించగా, ఇతర భక్తులు కొమురవెల్లిలోని ప్రైవేటు గదులను అప్పుడే అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్నారు. ఈక్రమంలో శని, ఆది, సోమవారానికి పలువురు ప్రైవేటు గదుల యాజమానులు రూ.4-8వేల చొప్పున అద్దె వసూలు చేశారు. కాగా ప్రైవేటు భవనాల అధిక అద్దెను నివారించేందుకు చర్యలు తీసుకుంటామని గతంలో గొప్పలు చెప్పిన జిల్లాఅధికారులు అవేమీపట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో భక్తుల జేబులకు చిల్లులుపడుతున్నాయి. ఈవిషయమై దేవాలయాధికారులు, జిల్లా అధికారులతో పాటు పునరుద్ధరణ కమిటీ ప్రత్యేక చొరవ వహించి బస ఇబ్బందులు తీర్చడంతో పాటు ప్రైవేటు గదుల అడ్డగోలు అద్దెవసూలు నివారణకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

మల్లన్న హాల్ట్‌స్టేషన్‌కు రైల్వేబోర్డు అనుమతి

- తిమ్మారెడ్డిపల్లి రైల్వేఅండర్‌బ్రిడ్జి సమీపంలో ఏర్పాటుకు చర్యలు

7లో


కొమురవెల్లి శివారులోని రైల్వేగేట్

20 నుంచి రంగనాయకసాగర్ నీటివిడుదల


రంగనాయకసాగర్‌లోకి గోదావరి జలాలను ఎత్తిపోస్తున్న దృశ్యం (ఫైల్)

సిద్దిపేటఅగ్రికల్చర్/ చిన్నకోడూరు, జనవరి17: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 18, 19, 20 తేదీల్లో అనంతగిరి రిజర్వాయర్ నుంచి రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి ఒక టీఎంసీ నీటిని పంపింగ్ చేయనున్నట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ బుధవారం ప్రకటనలో తెలిపారు. రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేసిన నీటిని రైతుల సౌకర్యార్థం, యాసంగి పంటలకు ఈనెల 20 నుంచి రంగనాయక సాగర్ నుంచి కాలువల ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

అక్రమంగా పట్టాను మార్చేశారు

- కోడలిపై వృద్ధురాలి ఫిర్యాదు
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన

8లో

విభజన సమస్యలను పరిష్కరించాలి

- తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

గజ్వేల్, జనవరి 17: విభజన సమస్యలను వెంటనే కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ రహదారిపై విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం చట్టం తయారీ చేసేటప్పుడు తేల్చాల్సిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గోదావరి, కృష్ణాజలాల విభజన అంశాలు, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల విభజన తదితర అంశాలపై చర్చించేందుకు త్వరలోనే సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మరో రెండు నెలలు పూర్తయితే పదేళ్ల కాల పరిమితి ముగుస్తుందని, ఇరు ప్రాంతాల అభివృద్ధికి చేసిన సూచనలను అమలు చేసేందుకు కృషిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, గత ప్రభుత్వం ఎక్కడా విభజన సమస్యలపై మాట్లాడలేదన్నారు. ప్రధాని మోదీ తెలంగాణ విభజన గూర్చి ఎప్పుడు మాట్లాడినా తప్పుగా జరిగిందని మాట్లాడుతున్నారని, ఈ నేపథ్యంలో విభజన హామీలను సాధించుకునేందుకు నిర్వహించనున్న ఈ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రాంచంద్రం, రాష్ట్ర కౌన్సిలర్ రాజులు, నాయకులు పాపిరెడ్డి, నాగరాజు, విద్యాసాగర్, సుంచు నరేందర్ ఉన్నారు.


గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాంను టీఏలు కోరారు. ప్రజ్ఞాపూర్‌లో తెలంగాణ జన సమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నిరుడి స్వామి ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపాధిహామీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, నెలవారీ జీతాలు రావడం లేదని, 18 ఏళ్లుగా పనిచేస్తున్నా ఎలాంటి పదోన్నతులు లేవని పేర్కొన్నారు. కలిసిన వారిలో తెలంగాణ జనసమితి యువజన అధ్యక్షుడు కీసరి స్వామి, జిల్లా కోకన్వీనర్ ప్రవీణ్‌కుమార్, మాల మహానాడు నాయకులు తుమ్మ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు పొన్నాల కుమార్, శ్యాం, సాయికుమార్, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు స్వామి, శ్రీగిరిపల్లి స్వామి, నవీన్ తదితరులున్నారు.

రిటైర్ అయినా 17 ఏళ్లుగా విధుల్లోనే!

- కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న రిటైర్డ్ ఈఈ
- ప్రభుత్వానికి నివేదించిన ఈఎన్‌సీ
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాల సేకరణ



ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 17 : ప్రభుత్వంలో కన్సల్టెంట్‌లుగా పనిచేస్తున్న వారితో పాటు ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా పనిచేస్తున్న రిటైర్డ్ అధికారులు, ఉద్యోగుల వివరాలను ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వెంటనే స్పందించిన జిల్లా అధికారులు కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న రిటైర్డ్ అధికారి పేరును ప్రభుత్వానికి నివేదించారు. మైనర్ ఇరిగేషన్ శాఖలో ఒకే ఒక్కరు కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. 17 ఏళ్లుగా ఈ రిటైర్డ్ ఈఈ ఉమ్మడి మెదక్ జిల్లా కన్సల్టెంట్‌గా కొనసాగుతున్నారని ఈఎన్‌సీ ప్రభుత్వానికి నివేదించింది.

2006 నుంచి కన్సల్టెంట్‌గా రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ పాలనలోనూ మైనర్ ఇరిగేషన్ శాఖకు ఉమ్మడి మెదక్ జిల్లా కన్సల్టెంట్‌గా రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లయ్య కొనసాగుతున్నారు. 2006లో సిద్దిపేట డివిజన్ మైనర్ ఇరిగేషన్ శాఖ ఈఈగా రిటైర్డ్ అయిన మల్లయ్య ఆ వెంటనే ఉమ్మడి జిల్లా కన్సల్టెంట్‌గా నియమితులయ్యారు. కన్సల్టెంట్‌గా ఇతనికి నెలకు రూ.75 వేల వేతనం, కారు అలవెన్సులు కలిపి సుమారు రూ.1.08 లక్షల వరకు ప్రభుత్వం చెల్లిస్తున్నది. కన్సల్టెంట్‌గా ఇతను మైనర్ ఇరిగేషన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి సాంకేతిక సలహాలను ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కన్సల్టెంట్‌గా నియమితులైనప్పటి నుంచి జిల్లా మంత్రులతో సత్సంబంధాలు ఏర్పరుచుకున్న మల్లయ్య ఉమ్మడి జిల్లా ఇరిగేషన్ శాఖలో సుప్రీంగా చెలామణి అయ్యారన్న విమర్శలున్నాయి. కన్సల్టెంట్ లేకుండా మైనర్ ఇరిగేషన్ శాఖ కార్యకలాపాలపై కలెక్టర్లు సైతం సమీక్ష చేయలేకపోయారంటే ఆయనపై ఎంతగా ఆధారపడ్డారో తెలుస్తున్నది. కన్సల్టెంట్‌గా ఆయన ఎలాంటి సలహాలు ఇచ్చారో.. ఉమ్మడి జిల్లాలో మైనర్ ఇరిగేషన్‌శాఖ ద్వారా ఏ రకంగా రైతులకు ప్రయోజనం చేకుర్చారో.. ఆయనను నియమించిన పాలకులకు, అధికారులకు తెలియాలి. మైనర్ ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ రాష్ట్రంలో కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న ఒకే ఒక్క అధికారి మల్లయ్య గురించి ప్రభుత్వానికి నివేదించారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ శాఖ ఎస్‌ఈ మురళీధర్ కూడా 'ఆంధ్రజ్యోతి'తో ధ్రువీకరించారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై ఆరా

ఇలా ఉండగా జిల్లాలోని వివిధ ప్రభుత్వం విభాగాల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానం ద్వారా రిటైర్డ్ అధికారులు, ఉద్యోగులు ఎందరు పనిచేస్తున్నారనే అంశంపై జిల్లా యంత్రాగం వివరాలు సేకరిస్తున్నది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి రెండు రోజుల కిందటే ఉత్తర్వులు అందాయి. దీని ప్రకారం జిల్లాలోని ఏఏ శాఖలో ఎందరు రిటైర్డ్ ఉద్యోగులు పనిచేస్తున్నారో తెలపాలని జిల్లా యంత్రాంగం నుంచి వివిధ శాఖల అధికారులకు ఆదేశాలు అందాయి. ఒకటి, రెండు రోజుల్లో జిల్లాలోని అన్ని శాఖల నుంచి పనిచేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల వివరాలు అందగానే జిల్లా సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించనున్నట్టు తెలిసింది.

ఒక్కతాటిపైకి బీఆర్ఎస్ అసంతృప్తులు

- వీగిపోనున్న అ'విశ్వాసం'?!
- డోలాయామానంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు

చేర్యాల, జనవరి 17 : చేర్యాల మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డిపై కొంతకాలంగా ఎడమొహం, పెడమొహంతో మెదులుతూ కాంగ్రెస్ కౌన్సిలర్లతో కలిసి అవిశ్వాసానికి తెరదీసిన బీఆర్ఎస్ అసంతృప్త కౌన్సిలర్లు ఏకతాటిపైకి చేరారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేపట్టిన మంత్రాంగం ఫలించడంతో కొద్దిరోజులుగా ఆందోళనకు గురవుతున్న చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్‌లు తమ కుర్చీలు ఇక సేఫ్ అని ఊరట చెందుతున్నారు. బీఆర్ఎస్‌కు ఉన్న ఏడుగురిలో నలుగురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు కౌన్సిలర్లతో కలిసి అవిశ్వాసం పేరిట ఆశలు కల్పించారు. దీంతో కొద్దిరోజుల క్రితం జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్‌కు అవిశ్వాస ప్రతిపాదన చేయడంతో ఈనెల 19న బలనిరూపణకు చర్యలు తీసుకున్నారు. కానీ అందివచ్చిన అవకాశాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడంలో విఫలమైంది. ఇక జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి తొలిపరీక్షగా నిలిచిన అవిశ్వాసాన్ని నెరవేరకుండా తగుచర్యలు చేపట్టడంతో ఒక్కసారిగా తలకిందులైంది. ఇటీవల సొంత పార్టీ కౌన్సిలర్లతో మాట్లాడి పార్టీలైన్ దాటకూడదని, 'భవిష్యత్తు' తనదేనని నయానో..బయానో...భరోసా కల్పించి హామీలపై స్పష్టత ఇచ్చారు. తద్వారా నెలకొన్న నాటకీయ పరిణామాలతో నలుగురు అసంతృప్త కౌన్సిలర్లు మెల్లిగా శాంతించారు. నలుగురు అసంతృప్తులలో బుధవారం ముగ్గురు కౌన్సిలర్లు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లతో కలిసి హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. తాము అవిశ్వాసాన్ని విరమించుకోబోతున్నామని పల్లాకు తెలిపారు. ఒకరిద్దరు బీఆర్ఎస్ అసంతృప్త కౌన్సిలర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న క్రమంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న చర్చమొదలైంది. నెల రోజులుగా నెలకొన్న ఉత్కంఠ ఫలితం అవిశ్వాస బలనిరూపణకు రెండురోజుల ముందుగానే తేలిపోవడంతో చేర్యాల రాజకీయం మరోమారు చర్చనీయాంశమైంది.


ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లతో చైర్‌పర్సన్ భర్త శ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి

యువకుడి ఆత్మహత్య కేసులో మహిళకు మూడేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, జనవరి 17: తనను ప్రేమించాలని వేధించి యువకుడి ఆత్మహత్యకు కారణమైన మహిళకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా అదనపు న్యాయాధికారి ఎం.రాధాకృష్ణ చౌహాన్ బుధవారం తీర్పు చెప్పారు. పెద్ద శంకరంపేట మండలం వీరోజిపల్లికి చెందిన సుంకరి అలియాస్ మేకల మొగులమ్మ(40) పటాన్‌చెరులోని చైతన్యనగర్ కాలనీలో నివాసముండేది. అదే కాలనీలో నివాసముంటున్న చిలకముక్కుల లింగం(20)తో ప్రేమ వ్యవహారం కొనసాగేది. పెద్దల సమక్షంలో వీరిద్దరి పంచాయితీ జరుగగా వారి నిర్ణయం మేరకు వేర్వేరుగా ఉంటున్నారు. అయితే మొగులమ్మ తనను ప్రేమించాలని అలాగే రూ.60 వేలు తీసుకుని రావాలని పలుమార్లు వేధించడంతో లింగం 2019 జూలై 24న పటాన్‌చెరులోని తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కొడుకు ఆత్మహత్యకు కారణమైన మొగులమ్మపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి కిషన్ పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని పూర్తి వివరాలను కోర్టులో సమర్పించగా నేరం రుజువు కావడంతో నిందితురాలు మొగులమ్మకు మూడేళ్ల జైలు శిక్ష, వేయి రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో నెల సాధారణ జైలు శిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా అదనపు న్యాయాధికారి ఎం.రాధాకృష్ణ చౌహాన్ బుధవారం తీర్పు చెప్పారు.

మురుగునీటిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

చేగుంట, జనవరి 17: చేగుంట గ్రామ శివారులోని శ్రీవేంకటేశ్వర ఆచరీస్ కంపెనీ, అయిత దివాకర్ ఇంటి సమీపంలోని మురుగునీటిలో గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమైంది. ఎస్‌ఐ హరీశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. వేంకటేశ్వర ఆచరీస్ కంపెనీ సమీపంలో 65 ఏళ్ల వ్యక్తి మురుగునీటిలో పడి చనిపోయి ఉన్నాడు. ఒంటిపైన మెరూన్ రంగు గీతల షర్టు, నలుపు రంగు ప్యాంట్, కుడి చేతికి రుద్రాక్ష దారం మాలతో పాటు స్టీల్ కడెం ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. చేగుంట గ్రామపంచాయతీ ఈవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే చేగుంట పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

నాగులపల్లిలో మట్టి టిప్పర్ల పట్టివేత


పట్టుబడిన మట్టి టిప్పర్లు

తూప్రాన్, జనవరి 17: తూప్రాన్ మండలం నాగులపల్లి శివారులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. నాగులపల్లి శివారు నుంచి మంగళవారం రాత్రి అక్రమంగా మట్టి తరలింపు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. తూప్రాన్ ఎస్‌ఐ-2 యాదగిరి ఆధ్వర్యంలో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నట్లు రెండు టిప్పర్లను పట్టుకున్నారు. పట్టుకున్న టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యాదగిరి వివరించారు.

పూతలేని మామిడి


పూతలేని మామిడిచెట్టు

- ఆందోళనలో అన్నదాతలు
- వాతావరణంలో మార్పులే కారణం
- సిద్దిపేట జిల్లాలో 13 వేల ఎకరాల్లో మామిడి తోట సాగు

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 17: పండ్ల తోటల్లో ముఖ్యమైనది మామిడి సాగు. అయితే ఈసారి చెట్లపై ఆశించిన స్థాయిలో పూత రావడం లేదు. ఈ సీజన్‌లో కొన్ని ప్రాంతాల్లో 20 శాతం తోటల్లో చెట్లు పూతపూయగా.. మరో 50 శాతం తోటల్లో ప్రస్తుతం చెట్లు మొగ్గదశకు వచ్చాయి. ఇంకనూ 30 శాతం తోటల్లో పూతరాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి మామిడిలో పూత, కాత ఆధారపడి ఉంటుంది. నవంబరు, డిసెంబరు మాసాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 13.5-18 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైతేనే పూత సరిగా వస్తుంది. కానీ ఈసారి నవంబరు, డిసెంబరు మాసాల్లో ఉష్ణోగ్రతల్లో 10-20 డిగ్రీల సెల్సియస్ స్థాయిలో భారీ హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. తక్కువ ఉష్ణోగ్రతలతో కాడల్లో పూతకట్టదు, పూతకట్టినవి బయటకు విచ్చుకోవు. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగినప్పుడు ముందుగా వచ్చిన పూత రాలిపోతుంది. ఇలా రెండు దశల్లో మామిడికి నష్టం వాటిల్లగా ఆలస్యంగా పూతవచ్చిన తోటల్లో ముదిరే ఎండలకు చిన్నకాయలు ఉడికి రాలిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నీటి లభ్యత ఎక్కువగా ఉన్నపుడు మొక్కల చిగుర్లు ఎక్కువగా వచ్చి పూతరావటం లేదు.

సిద్దిపేట జిల్లాలో 13 వేల ఎకరాల్లో రైతులు మామిడిని సాగు చేశారు. ఇందులో 90 శాతానికిపైగా బంగినపల్లి రకాలుండగా... మిగిలిన విస్తీర్ణంలో దశేరి, తదితర రకాలను రైతులు సాగుచేస్తున్నారు. చలికాలంలో పచ్చిపూత ఏర్పడి కాయలు బఠానిగింజ పరిమాణం దాటితేనే ఎండలు ముదురుతున్నకొలదీ కాయలు సమర్థంగా ఎదుగుతాయి. కానీ ఈసారి కొన్నిచోట్ల ఆలస్యం కావటం, పూత, కాత వచ్చినా నిలవకపోవటం, కాయలు చిన్నగా ఉండటం తదితర సమస్యలు తలెత్తనున్నాయి.


నంగునూరు మండలంలోని వెంకటపూర్‌లో పూత లేని మామిడి తోట

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మామిడి సాగుచేస్తున్న రైతులు పూతరాని చోట ప్రస్తుతం డ్రిప్ ద్వారా లేదా కాలువల ద్వారా పూర్తిస్థాయి నీటి తడిని ఇవ్వాలి. అయినా పూత రాకుంటే నేలలో నీటి తడి ఆరిన తర్వాత మరో తడిని ఇవ్వవచ్చు. రసం పీల్చు, పురుగు, బూడిద తెగులు నివారణతో పాటుగా పూమొగ్గలు రావడానికి, పూమొక్కలు విచ్చుకునేందుకు లీటరు నీటిని 2 మి.లీ మోనోక్రోటోఫాస్, 3 గ్రాముల వెట్టబుల్ సల్ఫర్, 10 గ్రాముల 19-19-19ను కలిపి చెట్లపై పిచికారీ చేయాలి. పచ్చిమొగ్గ, పచ్చిపూత దశలోనే మందులను చల్లాలి. తోటలకు నీటిని పారించాలి. తెల్లపూత దశలో మందులను పిచికారీ చేయవద్దు, నీటిని మామిడి చేట్లకు అందించవద్దు.

- భాస్కర్‌రెడ్డి, ఉద్యానశాఖ అధికారి, సిద్దిపేట

అప్పులబాధతో యువరైతు ఆత్మహత్య


నర్సింహులు (ఫైల్)

కౌడిపల్లి, జనవరి 17: అప్పులబాధతో యువరైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రానికి చెందిన బర్ల సాయిలుకు ఎకరంన్నర పొలం ఉన్నది. వ్యవసాయ పనులను కొడుకు నర్సింహులు(21) చూసుకుంటున్నాడు. అయితే ఆరునెలల క్రితం స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో రూ.1.50 లక్షల లోన్ తీసుకుని రెండు బోర్లు వేయించాడు. అయినా చుక్క నీరు పడలేదు. దీంతో తండ్రి సాయిలు మందలించడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కౌడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి గోల్డ్ లోన్‌తో పాటు ప్రైవేట్‌గా మరో రూ.3 లక్షల వరకు అప్పు ఉన్నదని తెలిపారు.

బోనాల బండ్ల ఊరేగింపులో అపశ్రుతి


బాబు (ఫైల్)

- బండి చక్రం కింద పడి యువకుడి మృతి

రాయపోల్, జనవరి 17: బోనాల బండ్ల ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకున్నది. బండి చక్రం కిందపడి యువకుడు మృతిచెందాడు. రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా రెండురోజులు బోనాల బండ్ల ఊరేగింపు నిర్వహిస్తారు. కాగా మంగళవారం సాయంత్రం బోనాల బండ్లను ఊరేగిస్తున్న క్రమంలో గ్రామానికి చెందిన దాసరి బాబు(27) ప్రమాదవశాత్తు బండి చక్రం కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హుటాహుటిన గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడి తండ్రి దాసరి నాంపల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు. కాగా మృతుడికి ఏడాది క్రితమే వివాహం అయ్యింది. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్, యువకుడి మృతి


సాయిప్రసాద్(ఫైల్)

నారాయణఖేడ్, జనవరి 17: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. మండల పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన జట్ల సాయిప్రసాద్(32) మంగళవారం సాయంత్రం బైక్‌పై నారాయణఖేడ్ వైపు నుంచి లింగాపూర్ వెళ్తుండగా గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిప్రసాద్‌కు తీవ్రగాయాలు కావడంతో అతడిని నారాయణఖేడ్ ఆస్పత్రి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి చిన్నాన్న జట్ల విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి వివరించారు. మృతుడికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారని, అతడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

రేపు ఐఐటీహెచ్‌లో ఇన్వెంటివ్ ఇన్నోవేషన్ ఫెయిర్

- ప్రారంభించనున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్


ఐఐటీ హైదరాబాద్

కంది, జనవరి 17: సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్(ఐఐటీహెచ్)లో దేశంలోని విద్యాసంస్థలు, పరిశ్రమల అనుసంధానం కోసం రేపు (ఈ నెల 19న) తేదీల్లో ఐఐటీహెచ్‌లో 'ఇన్వెంటివ్-2024' పేరుతో మెగా ఇన్నోవేషన్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇన్వెంటివ్ ఇన్నోవేషన్ ఫెయిర్‌కు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఐఐటీహెచ్‌లో తొలిసారిగా 19, 20వ తేదీల్లో మెగా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్‌అండ్‌డి) ఫెయిర్ 2వ ఎడిషన్‌లో సాంకేతిక పురోగమనాల వేడుక ఉంటుందన్నారు. ఈ వేడుకలో దేశంలోని అన్ని ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలతోపాటు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకు కలిగిన 120 ఉన్నత విద్యాసంస్థలు పాల్గొననున్నాయి. దీనికోసం పరిశోధన, ఆవిష్కరణల సమగ్ర ప్రభావాన్ని హైలైట్ చేయడానికి ఐఐటీహెచ్ వేదిక అవుతున్నదన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, వాతావరణ మార్పు, ఇ-మొబిలిటీ, క్లీన్‌ఎనర్జీ, స్థిరమైన సాంకేతికతలు, రక్షణ, అంతరిక్షం, పరిశ్రమలు వంటి ఐదు కీలక అంశాలపై సరికొత్త ఆవిష్కరణల ప్రదర్శనలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుక అట్టడుగు స్థాయిలో ఆవిష్కరణల అభివృద్ధికి చేరుకోవడానికి రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, సంస్థలు, పరిశ్రమల మధ్య సహకార మార్గాలను అన్వేషిస్తున్నదని వెల్లడించారు. పరిశోధకుల జ్ఞాన మార్పిడికి విలువైన అవకాశాలను అన్వేషించడానికి ఇదొక చక్కటి వేడుక అన్నారు. ప్రపంచ సవాళ్లను అధిగమించే సాంకేతిక పురోగతులను ముందుకు తీసుకెళ్లేందుకు విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించడం ద్వారా ఈ ఈవెంట్ డైనమిక్ ప్లాట్‌ఫారమ్‌గా పనిచేస్తున్నదని వివరించారు. ఈ సహకారం మా పరిశోధనా ప్రయత్నాలను సద్వినియోగం చేస్తూ, పారిశ్రామిక పెట్టుబడులను సులభతరం చేస్తున్నదన్నారు. భారతదేశం, ప్రపంచ మార్కెట్ కోసం రూపొందించిన ఉత్పత్తుల ఆవిష్కరణకు దారి తీస్తున్నదని మూర్తి ఆకాంక్షించారు.

రైతులు ఆదాయం పెంచుకునే విధంగా కృషిచేయాలి


కేవీకేలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు డీడీఎం క్రిష్ణతేజ

జహీరాబాద్, జనవరి 17: మారుతున్న కాలానుగుణంగా రైతులు ఆదాయం పెంచుకునే విధంగా కృషిచేయాలని నాబార్డు డీడీఎం క్రిష్ణతేజ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అల్గోల్ గ్రామ శివారులోగల కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో పలువురు మహిళా రైతులకు వివిధరకాల వ్యవసాయ పనిముట్లను అందజేసి మాట్లాడారు. మార్కెట్లో చిరుధాన్యాలకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులు వాటి సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. మారుతున్న కాలానుగుణంగా రైతులు ఆధునిక పద్ధతులను అవలంభిస్తూ వ్యవసాయం చేస్తే మరింత లాభాలను సాధించగలుగుతారని పేర్కొన్నారు. రైతులు వారి వారి వ్యవసాయ భూముల్లో ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు చేయించుకుని ఏ రకమైన పంటలను వేస్తే ప్రయోజనం ఉంటుందనే విషయాన్ని గ్రహిస్తూ అధికారుల, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను విధిగా పాటించాలన్నారు. అత్యవసరమనిపించిన వారికి నాబార్డు సహాయం అందిస్తామని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా పలువురు మహిళా రైతులకు చిరుధాన్యాల సాగుకు అనువైన నేలలు, ఎరువు తయారీ, సాగులో మెళకువలు, కషాయాల తయారీ, వివిధరకాల చిరుధాన్యాల ఉత్పత్తుల ప్యాకింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు హేమలత, స్నేహలత, డీడీఎస్ మహిళలు, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వద్దకు దుబ్బాక మున్సిపల్ పంచాయితీ!

- చైర్‌పర్సన్‌ను దించాల్సిందేనంటున్న కౌన్సిలర్లు
- రాజీనామా చేయకుంటే, అవిశ్వాసమే?
- 16 మంది సభ్యులతో సంతకాల సేకరణ

దుబ్బాక, జనవరి 17: దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, ఆమె భర్త భూంరెడ్డి వ్యవహార శైలిపై కౌన్సిలర్లలో నెలకొన్న అసమ్మతి పంచాయితీ బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వద్దకు చేరింది. రెండేళ్లుగా ఉన్న అసంతృప్తిని మాజీ మంత్రి హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డి చొరవతో సద్దుమణిగినా, తాము ఇక ఏగలేమంటూ నెల రోజులుగా కౌన్సిలర్లంతా అసమ్మతి సెగలతో మండిపోతున్నారు. ఇదే క్రమంలో వీరి అభిప్రాయం తానే స్వయంగా సేకరించేందుకు గురువారం సమావేశం కావాల్సిందిగా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి కౌన్సిలర్లను ఆదేశించారు. గురువారం అసమ్మతికి చెందిన 16 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే వద్దకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. మంగళవారమే దుబ్బాకలోని ఒక కౌన్సిలర్ ఇంట్లో సమావేశమైన 16 మంది సభ్యులంతా ఏకగ్రీవ తీర్మానం చేశారు. దుబ్బాక మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై చర్చ జరిపినట్టు తెలిసింది. తాము ఎట్టి పరిస్థితిలో చైర్‌పర్సన్‌ను కొనసాగించలేమనీ, తామంతా కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టి, క్యాంపునకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నా.. అధిష్టానం మీద గౌరవంతో సహనంతో ఉంటున్నామని వారు వాపోయారు. గురువారం ఎమ్మెల్యేను కలిసి తమ గోడును వినిపించనున్నారు. తమ మాటకు ప్రాధాన్యం ఇవ్వకుంటే తమ దారి తాము చూసుకుంటామని అంటున్నారు. వీరి వ్యవహారంపై అధికార పార్టీ కూడా నిఘా వేసినట్టు తెలిసింది.

ఎమ్మెల్యేను కలిసిన చైర్‌పర్సన్ భర్త, వైస్ చైర్‌పర్సన్ భర్త

కౌన్సిలర్ల వ్యవహారంలో బుధవారం చైర్‌పర్సన్ గన్నె వనిత భర్త భూంరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అదికం సుగుణ భర్త బాలకిషన్ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని కలిశారు. దుబ్బాక మున్సిపల్ వ్యవహారం తలనొప్పిగా మారడంతో ఎమ్మెల్యేను వీరు కలవడం ప్రాధాన్యం సంతరించుకున్నది. అయితే కౌన్సిలర్ల అసంతృప్తి పట్ల చైర్‌పర్సన్ భర్త భూంరెడ్డిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గురువారం తాను అసంతృప్తి కౌన్సిలర్లతో మాట్లాడిన తర్వాత నిర్ణయం తీసుకుంటానని తేల్చిచెప్పినట్టు తెలిసింది. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కౌన్సిలర్లు ఆస యాదగిరి కూడా ఉన్నారు.

మల్లన్న హాల్ట్‌స్టేషన్‌కు రైల్వేబోర్డు అనుమతి

- తిమ్మారెడ్డిపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో ఏర్పాటుకు చర్యలు


రైల్వేహాల్ట్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రదేశం

చేర్యాల, జనవరి 17: కొమురవెల్లి మల్లన్న చెంత రైల్వేహాల్ట్‌స్టేషన్ ఏర్పాటుకు కేంద్ర రైల్వేశాఖబోర్డు ఎట్టకేలకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. దీంతో మల్లన్న భక్తుల రైల్వేస్టేషన్ కల సాకారానికి నెలకొన్న అడ్డంకులు తొలగిపోనున్నాయి. తెలంగాణలోని ప్రముఖ శైవక్షేత్రాలలో ప్రధానమైన మల్లికార్జునస్వామి కొలువైన కొమురవెల్లి మీదుగా కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ చేపట్టారు. కానీ రైల్వేస్టేషన్ల జాబితాలో కొమురవెల్లి లేకపోవడంతో స్థానికంగా హాల్ట్‌స్టేషన్ ఏర్పాటుచేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ విషయమై గవర్నర్ తమిళిసై, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సహా పలువురు నేతలు హామీఇచ్చారు. గతేడాది ఏప్రిల్ 20న ఎంపీ బండి సంజయ్ రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సంప్రదించడంతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను ఆదేశించారు. దీంతో రైల్వే అధికారులు స్థానిక పరిస్థితులు పరిశీలన జరిపారు. హాల్ట్‌స్టేషన్ ప్రతిపాదిత స్థలం ఎత్తు పల్లాల మధ్యన ఉండటం, సిగ్నలింగ్‌తో పాటు ప్రత్యామ్నాయ చర్యలన్నీ రూలింగ్ గ్రేడ్ పరిధిలో ఉండటం వల్ల కేంద్ర రైల్వే బోర్డు అనుమతి తప్పనిసరి కావడంతో ప్రతిపాదనలు పంపించింది. ఈ విషయమై రైల్వేశాఖ డీఆర్ఎం కొద్దిరోజుల క్రితం మల్లన్న ఆలయానికి వచ్చి వివరాలు వెల్లడించారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్ శివారు తిమ్మారెడ్డిపల్లి కమాన్ స్వాగత తోరణం సమీపంలోని రైల్వే అండర్‌బ్రిడ్జి నుంచి గ్రామానికి వెళ్లే ఆర్‌వోబీ మధ్యన స్థలాన్ని ప్రతిపాదించారు. తాజాగా కేంద్ర రైల్వేబోర్డు అనుమతి పొందిన క్రమంలో టెండర్ల నిర్వహణ, భూసేకరణతో పాటు పనుల ప్రారంభానికి నెలకొన్న ఆటంకాలు తొలగిపోనుండటంతో కొన్నాళ్లలోనే మల్లన్న హాల్ట్‌స్టేషన్ అందుబాటులోకి రానున్నది. సిద్దిపేట నుంచి తిరుపతికి వెళ్లే రైలుతో పాటు మరిన్ని రైళ్లను రానున్న రోజుల్లో హాల్ట్‌చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

గ్రామీణ ప్రాంతాల్లో చిరుధాన్యాల సాగు పెరగాలి: డీడీఎస్


గొడిగర్‌పల్లిలో పాత పంటల జాతరను నిర్వహిస్తున్న దృశ్యం

కోహీర్ జనవరి 17: గ్రామీణ ప్రాంతాల్లో చిరుధాన్యాల సాగు పెరగాలని డీడీఎస్ సూపర్‌వైజర్ వినయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని గొడిగర్‌పల్లి గ్రామంలో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) సభ్యులు బుధవారం చిరుధాన్యాల విశిష్టతను వివరిస్తూ పాత పంటల జాతర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామ రైతు సంగన్న ఎడ్ల బండ్లకు పూజ చేసి బండ్ల ఊరేగింపు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీఎస్ సంఘం మహిళలు పాటలు పాడుతూ, ఆటల ఆడుతూ విత్తనాలతో అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపులో గ్రామ ప్రజలకు చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే పాత పంటల అవశ్యకత తెలియజేశారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలుసుకోవడమే కాకుండా వాటిని పండించాలన్నారు. చిరుధాన్యాల ఆహారాన్ని తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తున్నదని చెప్పారు. అంతరించిపోతున్న చిరుధాన్యాల పంటలను తిరిగి పండించే విధంగా గ్రామీణ రైతుల ప్రోత్సహించాలని సూచించారు. సాధారణ పంటల కన్నా చిరుధాన్యాల పంటలకు ప్రస్తుతం ఆదరణ ఎక్కువగా ఉన్నదన్నారు. చిరుధాన్యాలతో చేయబడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు ఎక్కువ కాలం జీవించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనుసుజతుకృప్ప, రైతులు రాములు, కనకరాజు, ఎంపీటీసీ భీమ్‌సింగ్, డీడీఎస్ సిబ్బంది చుక్కమ్మ, చిన్న నర్సమ్మ, జనరల్ నర్సమ్మ, మంజుల, లక్ష్మయ్య, పులమ్మ, వినయ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వ్యక్తికి రిమాండ్

జహీరాబాద్, జనవరి 17: జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిర్ చౌరస్తాలో గల అంబిక మెడికల్ దుకాణం యజమాని వైద్యనాథ్‌ను దుకాణాన్ని ఖాళీ చేయాలంటూ చాకుతో బెదిరిస్తూ.. దాడిచేసి గాయపరిచిన కేసులో శాంతినగర్‌కు చెందిన ఇక్బాల్‌అహ్మద్‌ను బుధవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. 2023 అక్టోబరు 8న శాంతినగర్‌కు చెందిన ఇక్బాల్ అహ్మద్ దాడి చేశాడన్నారు. అప్పట్లో కేసు నమోదు చేశామని, కానీ నిందితుడు పరారీలో ఉండగా బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. న్యాయాధికారి 14 రోజుల పాటు రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


మృతిచెందిన మహిళ

సంగారెడ్డి క్రైం, జనవరి 17: సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందినట్లు పట్టణ సీఐ శ్రీధర్‌రెడ్డి హైదరాబాద్‌లోని బాలానగర్ ఫతేనగర్‌కు చెందిన ఎర్రొళ్ల భూదమ్మ(50) చికిత్స నిమిత్తం 8న ప్రభుత్వ ఆసుపత్రికి ఒంటరిగా వచ్చింది. అయితే చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామని, ఆమె ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు


కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడు

మెదక్ అర్బన్, జనవరి 17: వీధి కుక్కలు దాడిచేసి బాలుడిని గాయపర్చిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రంలోని జంబికుంటలో చోటు చేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. జంబికుంట వీధికి చెందిన తైమూర్ ఇంటి ఎదుట ఆడుకుంటుండగా.. వీధి కుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడిచేసి గాయపర్చాయి. వెంటనే తైమూర్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తండ్రి అబ్దుల్ షాకీర్ తెలిపారు. గాయపడ్డ బాలుడు తైమూర్‌తో తండ్రి షకీర్, అతని కుటుంబసభ్యులు ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఓవైసీ బాలుడికి మెరుగైన వైద్యసేవలు అందిచేలా చూడాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌కు సూచించారు. దీంతో ఎమ్మెల్యే బాలుడికి మెరుగైన చికిత్స అందించేలా చూడాలంటూ తెలంగాణ ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినాను కోరారు. ఈ మేరకు సరోజిని కంటి ఆస్పత్రిలో బాలుడికి మెరుగైన వైద్యచికిత్సలు అందించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి సరోజినీ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

వుడ్ వర్క్‌షాప్‌లో అగ్నిప్రమాదం

- రూ.8 లక్షల ఆస్తి నష్టం ● రామాయంపేటలో ఘటన

రామాయంపేట, జనవరి 17: పట్టణంలోని ఓ వుడ్ వర్క్‌షాప్‌లో మంగళవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఘటనలో రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. పట్టణానికి చెందిన వడ్ల శ్రీనివాస్ తమ ఇంటిని ఆనుకుని ఉన్న స్థలంలోనే చిన్నపాటి మిషన్ ఏర్పాటు చేసుకుని నిర్మాణంలో ఉన్న ఇళ్లకు బిగించే తలుపులు, చౌకోట్లు తయారు చేస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని టేకు బెండ్లు, ఇతర విలువైన కట్టెలు సమకూర్చుకుని నిల్వచేశాడు. అయితే మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని వర్క్‌షాపులో పెద్దగా మంటలు ఎగిసిపడ్డాయి. అవి శ్రీనివాస్ ఇంటిని చుట్టేలోపు పొరుగున ఉన్నవారు గమనించి అప్రమత్తం చేశారు. దీంతో ఆ కుటుంబం చిన్నటి డోర్ నుంచి బయటికి రాగా ముప్పు తప్పింది.

సంగారెడ్డిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

సంగారెడ్డి అర్బన్, జనవరి 17: సంగారెడ్డిలోని పలు హోల్‌సెల్ కిరాణం షాపు, రెస్టారెంట్లలలో ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడులు చేశారు. డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్ టి.విజయ్‌కుమార్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎం.ఏ.ఖలీల్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ధర్మేంద్ర పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని ఓ కిరాణా హోల్‌సెల్‌తో పాటు కొత్త బస్టాండ్ సమీపంలోని మరో హోల్‌సెల్ కిరాణం షాపులో తనిఖీలు చేసి శాంపిళ్లను సేకరించారు. అదేవిధంగా పోతిరెడ్డిపల్లి చౌరస్తా సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో తనిఖీలు చేసిన అధికారులు వంట గది అపరిశుభ్రంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశుభ్రంగా లేకపోతే చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ పొందాలని, లైసెన్స్ లేకుండా విక్రయించడం చట్ట విరుద్ధమన్నారు.

అంతర్జాతీయ సాహస శిబిరానికి తారా విద్యార్థుల ఎంపిక


రంజిత్‌రెడ్డి


అమర్


రాజేశ్

సంగారెడ్డి అర్బన్, జనవరి 17: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మూడురోజుల పాటు ఒడిస్సాలో జరిగే అంతర్జాతీయ సాహస శిబిరానికి ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ సహకారంతో ప్రాజెక్ట్ పాయింట్, ప్రేరణ ఆధ్వర్యంలో ఒడిస్సాలోని కోర్దాలో ఫిబ్రవరి 10 నుంచి 12 వరకు జరిగే శిబిరంలో కళాశాలకు చెందిన రంజిత్‌రెడ్డి, అమర్, రాజేశ్‌లు పాల్గొననున్నారు. మూడురోజుల పాటు జరిగే ఈ శిబిరంలో ట్రెక్కింగ్ వంటి అంశాలలో శిక్షణ పొందనున్నారు. సాహస శిబిరానికి ముగ్గురు విద్యార్థుల ఎంపికకావడం పట్ల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

ఏసీబీ దాడిలో పట్టుబడ్డ బల్దియా ఉద్యోగి

- రూ.8 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండ్‌గా చిక్కిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ● ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సైతం పట్టివేత


ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డ డబ్బులు

సదాశివపేట, జనవరి 17: ఏసీబీ దాడిలో ఇద్దరు బల్దియా ఉద్యోగులు పట్టుబడ్డారు. రూ.8 వేల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఏసీబీ మెదక్ రేంజ్ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపేట పట్టణానికి చెందిన ఆకుల సంగమేశ్వర్ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ సమీపంలో మున్సిపల్ అనుమతులతో ఏర్పాటు చేసిన (ఈకోవాల్యూ) అధికారిక వెంచర్‌లో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగం పూర్తిస్థాయి అనుమతులతో కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. నిర్మాణం పూర్తికాగానే ఇంటి నెంబర్ కేటాయించాలని మున్సిపల్ రెవెన్యూ విభాగంలో 2023 సెప్టెంబరు 25న దరఖాస్తు చేసుకున్నాడు. అందుకు లీగల్‌గా కావాల్సిన అన్ని డాక్యుమెంట్స్‌ను సమర్పించాడు. ఇంటి నెంబర్ కేటాయించాలని సంగమేశ్వర్ కుమారుడు ఆకుల శివకుమార్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పతంగి వెంకట్రావ్, అదే విభాగానికి సంబంధించి పలు రకాల దరఖాస్తులను పరిశీలించే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వేణు చుట్టూ నాలుగు నెలల నుంచి తిరిగాడు. చివరకు రూ.10 వేలు ఇస్తేనే ఇంటి నెంబర్ కేటాయిస్తామని ఆర్ఐ వెంకట్రావ్, ఓఎస్ ఉద్యోగి వేణు చెప్పారు. దీంతో శివకుమార్ 2023 డిసెంబరు 22న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ మెదక్ రేంజ్ డీఎస్పీ ఆనంద్‌కుమార్, ఆ శాఖ సీఐ వెంకట్‌రాజ్ గౌడ్, ఇన్‌స్పెక్టర్ రమేష్ రంగంలోకి దిగి బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో మున్సిపల్ కార్యాలయంలో ఆర్ఐ వెంకట్రావ్, ఓఎస్ ఉద్యోగి వేణుకు శివకుమార్ రూ.8 వేలు అందజేశాడు. అంతకుముందే కార్యాలయం ఆవరణలో మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరిపై సెక్షన్ 7(బీ), సెక్షన్ (12)ల కింద కేసులు నమోదు చేశామన్నారు.

గతంలోనూ ఏసీబీ దాడులు

ఏసీబీ దాడులు సదాశివపేట మున్సిపాలిటీకి కొత్తేమి కాదు. గతంలో 2005-06 మధ్యకాలంలో ఓ ఉద్యోగి ఏసీబీ దాడుల్లో పట్టుబడగా, 2014-15లో స్వయనా మున్సిపల్ ఇంజనీర్ పట్టణంలో హైమాస్ట్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటులో కాంట్రాక్టర్ వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఇక 2018 సంవత్సరం డిసెంబరులో టౌన్‌ప్లానింగ్ (టీపీఓబీ), ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఒకరు ఓ బహుళ అంతస్తుల భవన నిర్మాణం విషయంలో రూ.70వేలు లంచం తీసకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ వలకు చిక్కారు. కాగా మున్సిపల్‌లో పలు సందర్భాల్లో ఏసీబీ అధికారుల దాడుల నుంచి ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది తప్పించుకోవడం గమనార్హం.


విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్

వేచరేణి వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



దీక్ష ప్రారంభానికి ముందు వాగులో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

చేర్యాల, జనవరి 17: చేర్యాల మండలం వేచరేణి గ్రామశివారులోని వాగుపై బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టాలని డిమాండ్‌చేస్తూ బుధవారం గ్రామస్థులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వాగు ఆవరణలో ఏర్పాటు చేసిన దీక్ష శిబిరంలో నిరసన తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. తమ గ్రామ శివారులోని వాగు అవతలి ఒడ్డున వైకుంఠధామంతో పాటు వ్యవసాయభూములు ఉండటంతో నిత్యం రైతులు, ప్రజలు వాగుమీదుగా రాకపోకలు సాగిస్తున్నట్టు తెలిపారు. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే వరదనీటిలో నుంచే ప్రాణాపాయ పరిస్థితుల్లో ఒడ్డుకుచేరి దహనసంస్కారాలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అంతేకాకుండా చేర్యాల-కొమురవెల్లి మండలాలకు ఎంతోకాలంగా వేచరేణి గ్రామంమీదుగా అతి తక్కువ దూరంలో ప్రయాణించే అవకాశం ఉండటంతో వాగుపై బ్రిడ్జి అత్యంత ఆవశ్యంగా మారిందన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, పనులు ప్రారంభించడంలో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు ప్రారంభింపజేసేంత వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

పిల్లలకు సరైన పోషకాహారాన్ని అందించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



హుస్నాబాద్‌లో గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గరిమా అగ్రవాల్

కోహెడ, జనవరి 17: పిల్లలకు సమయానికి తగిన విధంగా పోషకాహారాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. మండలంలోని గుండారెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఓరుగంటి అశోక్‌రెడ్డి ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో తక్కువ బరువుతో ఉన్న పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారికి సరైన పోషకాహారం అందేలా చూడాలన్నారు. పిల్లల తల్లులు నాణ్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసే ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరగా వచ్చేలా చూడాలని సర్పంచ్ అశోక్‌రెడ్డి అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, ఎంపీడీవో మధుసూదన్, ఎంపీటీసీ కళ్యాణి, మండల వైద్యాధికారి నిమ్రా, సీడీపీవో జయ, అంగన్‌వాడీ సిబ్బంది నిర్మల, ఉమా, సీపీ లింగం, ఇతర వైద్య సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనం పనులను త్వరగా పూర్తి చేయాలి

హుస్నాబాద్, జనవరి 17 : హుస్నాబాద్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో రూ. 50 లక్షలతో చేపట్టిన గ్రంథాలయ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బుధవారం ఆమె గ్రంథాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు ఎప్పుడు ప్రారంభించారని అడిగి తెలుసుకున్నారు. బిల్లులకు సంబంధించి ఇబ్బందులేమీ లేవని తెలిపారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తదితరులున్నారు.

బండి సంజయ్‌పై చర్యలు తీసుకోండి

- ఎంపీగా ఆయన చట్టాన్ని ఉల్లంఘించారు
- పోలీసులకు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్, జనవరి 17: పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఖాయంగా కూలిపోతుందని అంటున్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు స్థానిక కాంగ్రెస్ నాయకులు హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్, ఎస్ఐ తోట మహేశ్‌లకు ఫిర్యాదు చేశారు. బుధవారం హుస్నాబాద్ పోలీసుస్టేషన్‌లో సీఐను కలుసుకుని బండి సంజయ్‌పై వెంటనే కేసు నమోదు చేయాలని వారు కోరారు. 'ఈ నెల 14న బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనడానికి మాజీ సీఎం కేసీఆర్ ప్రణాళిక రచిస్తున్నారని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆయన ఏదైనా చేయొచ్చని అన్నారు. కాంగ్రెస్‌లో కేసీఆర్ కోవర్టులు చాలామంది ఉన్నారని, పోటీచేసిన చాలామంది అభ్యర్థులకు డబ్బులు ఇచ్చారని వ్యాఖ్యానించారు.' ఒక ఎంపీ అయిన ఆయన వద్ద ఇంత సమాచారం పెట్టుకొని పోలీసులకు చెప్పకపోవడం చట్టానికి వ్యతిరేకమని ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ టీపీసీసీ సభ్యుడు లింగమూర్తి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని తెలిసి కూడా ఆయన దాచడం అర్థరహితమని పేర్కొన్నారు. దీని ప్రకారం బండి సంజయ్ కూడా నేరస్థుడేనని, ఆయనపై కేసు నమోదు చేసి విచారించి నిజం రాబట్టాలని పోలీసులను కోరినట్లు లింగమూర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, సరోజన, డాక్టర్ అక్కు శ్రీనివాస్, నాయకులు వెన్న రాజు, పెరుమాండ్ల నర్సాగౌడ్ తదితరులున్నారు.

కాలువలతో నీరందించి దుబ్బాకను సస్యశ్యామలం చేస్తా



దుబ్బాక: బొప్పాపూర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కేపీఆర్

దుబ్బాక, జనవరి 17: దుబ్బాక రైతాంగం కోసం ఉద్దేశించిన మల్లన్నసాగర్ నుంచి కాలువల ఏర్పాటు పనులు ఇంకా మిగిలే ఉన్నాయని, వాటిని పూర్తి చేసి దుబ్బాకను సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం దుబ్బాక మండలం శిలాజీనగర్, వెంకటగిరి తండా, అచ్చుమాయిపల్లి, అక్బర్‌పేట మండలం చౌదర్‌పల్లి, బొప్పాపూర్, నూతన గ్రామపంచాయతీ భవనాలను, చిన్ననిజాంపేట గ్రామంలో నిర్మించిన కుర్మ, ముదిరాజ్ సామాజిక భవనాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మల్లన్నసాగర్ ద్వారా దుబ్బాక నియోజక వర్గంలోని లక్షా 30 వేల ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో తాను పని చేస్తున్నానన్నారు. ఇందు కోసం సంబంధిత మంత్రిని కూడా కలిసి, విన్నవించానన్నారు. కూడవెల్లి వాగుకు సత్వరమే నీరందించాలని కోరామన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే, ఎలాంటి పోరాటానికైనా సిద్ధమన్నారు. ఆయన వెంట ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత, శేర్ల కైలాస్, సర్పంచులు మాదూరి శ్రీనివాస్, పెంటమ్మ, రచన, స్వప్న, కుమార్, జీడిపల్లి రవి ఉన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి

మిరుదొడ్డి, జనవరి 17: పార్టీలకు అతీతంగా గ్రామాలను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో మాల సంఘం, గొల్లసంఘం కమ్యూనిటీ భవనాలతో పాటు ఆలయ రీడింగ్ గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ. 5లక్షల వ్యయం కాగల కుర్మ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన వెంట గ్రామసర్పంచు శ్రీనివాస్, ఎంపీపీ సాయిలు, జడ్పీటీసీ లక్ష్మీలింగం, ఉపసర్పంచు మానస, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మనోహర్‌రావు, సతీష్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బాలమల్లేశం, బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.



సిద్దిపేట సీపీ అనూరాధకు మల్లన్న చిత్రపటం అందిస్తున్న ఈవో బాలాజీ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి

సిద్దిపేట సీపీని కలిసిన మల్లన్న ఆలయవర్గాలు

చేర్యాల, జనవరి 17: కొమురవెల్లి మల్లన్న ఆలయ ఈవో బాలాజీ, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తదితరులు బుధవారం సిద్దిపేట సీపీ అనూరాధను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. వచ్చే ఆదివారం జరగనున్న పట్నంవారం, అగ్ని గుండాల నిర్వహణతో పాటు జాతరలో బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు.

ప్రయాణికులతో బస్టాండ్ కిటకిట



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న హుస్నాబాద్ బస్టాండ్

హుస్నాబాద్, జనవరి 17: సంక్రాంతి పండుగకు గ్రామాలకు వచ్చినవారు తిరుగుబాట పట్టారు. తిరిగి పట్టణాలకు వెళ్లే ప్రయాణికులతో బుధవారం హుస్నాబాద్ బస్టాండ్ కిటకిటలాడింది. బస్సుల్లో ప్రయాణికులు కిక్కిరిసి వెళ్లారు. ముఖ్యంగా హైదరాబాద్, సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ రూట్లో వెళ్లే ఒక్కోబస్సులో వంద మందికి పైగా తరలివెళ్లడం గమనార్హం.

మైనారిటీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, జనవరి 17: గజ్వేల్ పట్టణంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థలో వచ్చే విద్యా సంవత్సరానికి వివిధ తరగతుల్లో ప్రవేశాలకు ఈ నెల 18నుంచి ఫిబ్రవరి 6వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ తెలిపారు. గజ్వేల్‌లోని పాఠశాలలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో లేదా నేరుగా పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 5వ తరగతిలో మైనారిటీలకు ముందు వచ్చిన వారికి సీట్లు ఇస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు లక్కీ డ్రా ద్వారా సీట్లను కేటాయిస్తామన్నారు. ఆదేవిధంగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, కావున ఎంపీసీ, బైపీసీలలో 40సీట్లకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తపాస్‌పల్లి నీటిని విడుదల చేయాలి



మట్టితో నిండిన కాలువను పరిశీలిస్తున్న భూమిరెడ్డి

కొండపాక, జనవరి 17: కొండపాక మండల రైతుల పంట పొలాలకు తపాస్‌పల్లి డి-4 కెనాల్ కాలువ నీటిని అందించేలా ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి పేర్కొన్నారు. తపాస్‌పల్లి నుంచి కొండపాక మండలానికి వచ్చే డి-4 కాలువను బుధవారం ఆయన స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యాసంగి పంట చేతికి రావాలంటే పూడుకుపోయి కాల్వల ద్వారా చెరువులలోకి సాగునీరు అందకపోతే పంటలు పండని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రైతులను ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. కొండపాక మండలం లోని పదకొండు గ్రామాలకు 2011లో సాగు నీరు అందించేందుకు అప్పటి ప్రభుత్వం తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా డి-4 కెనాల్ పేరుతో కాలువ నిర్మాణాలు చేపట్టి తాగునీటి సరఫరా చేసి ఆయా గ్రామాల చెరువులను నింపారని, వేసవిలో సైతం చెరువులు నిండు కుండల్లా ఉండేవన్నారు. ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణలో ప్రతీ గ్రామానికి సాగునీరు అందించారన్నారు. కొద్ది రోజులుగా కాలువలను ఎవరూ పట్టించుకోకపోవడంతో గండ్లు పడి, పూడికలు నిండి నీటి పారుదలకు అంతరాయం ఏర్పడినట్లు రైతులు తన దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. సాగునీరు సరిగా అందక ఏర్పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని వెంటనే కాలువల ద్వారా నీరు అందించే ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. కొండపాక మండలంలోకి నీరు అందాలంటే కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామ శివారులో ఉన్న పూడికతీత పనులను అధికారులు వెంటనే పరిశీలించి ప్రారంభించాలని సూచించారు. అధికారుల పర్యవేక్షణలో అన్ని గ్రామాలకు సరైన విధంగా సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం



ముగ్గుల పోటీల విజేతలతో ఎమ్మెల్సీ తదితరులు

గజ్వేల్ రూరల్, జనవరి 17: గజ్వేల్‌లో శ్రీ రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు ఆధ్వర్యంలో బుధవారం పేపర్‌పై నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలో 436 మంది మహిళలు పాల్గొన్నారు. విజేతలుగా ప్రథమ స్థానంలో వి. చందన, ద్వితీయ స్థానంలో టి.వి జయలక్ష్మి, తృతీయ స్థానంలో పి.ప్రేమావతి నిలిచారు. వీరితో పాటు 50 మందికి కన్సోలేషన్ బహుమతులను ఎమ్మెల్సీ యాదవరెడ్డి ప్రదానం చేశారు.

సమాజానికి లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్ క్లబ్ రీజియన్ చిత్రమాలికను ఆవిష్కరిస్తున్న తనికెళ్ల భరణి

గజ్వేల్, జనవరి 17: సమాజానికి లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని సినీ నటుడు తనికెళ్ల భరణి పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల చిత్రాల పోస్టర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండాలని, సమాజానికి లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు ఎంతో గొప్పవన్నారు. భవిష్యత్తులో నిరుపేదలకు మరింత విస్తృత సేవలను అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ సెక్రేటరీ సంజయ్‌గుప్తా, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ గజ్వేల్ అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, విశ్వేశ్వర్‌రావు, శంకర్ నారాయణ, కార్తీక్ ఉన్నారు.

మోతెలో గుండెపోటుతో యువకుడి మృతి

- చందాలు వేసి అంత్యక్రియలు నిర్వహించిన గ్రామస్థులు



సంతోష్(ఫైల్)

మిరుదొడ్డి, జనవరి 17: గుండెపోటుతో యువకుడు మృతి చెందిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నీల సంతోష్(38) అనే యువకుడు ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలి కిందపడిపోయాడు. 108 అంబులెన్స్ వచ్చేలోపే మృతి చెందాడు. సంతోష్ పేద కుటుంబానికి చెందినవాడు కావడంతో సర్పంచు కాలేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామస్థులు సుమారు రూ.50వేల వరకు చందాలను పోగుచేసి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉదారతను చాటుకున్న 'నేతాజీ' పూర్వ విద్యార్థులు



వైద్యం కోసం ఉపాధ్యాయురాలికి ఆర్థికసాయం అందజేసిన పూర్వ విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, జనవరి 17: తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఉదారత చాటుకున్నారు పూర్వ విద్యార్థులు. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట నేతాజీ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సునీత అనే టీచర్ కుమారుడు ప్రస్తుతం బ్లడ్ క్యాన్సర్‌తో హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తమకు ఆర్థిక సాయం అందించాలంటూ ఆ ఉపాధ్యాయురాలు సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులను చూసి స్పందించిన పాఠశాల పూర్వవిద్యార్థులు సుమారు రూ.67 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం పాఠశాలకు వెళ్లి ఆమెకు అందజేశారు. ఎప్పుడో చదువు చెప్పిన విద్యార్థులు ఇప్పుడు వచ్చి ఆర్థిక సహాయం అందించడం పట్ల సదరు ఉపాధ్యాయురాలు వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సింగోజి జనార్దన్, రంగధాంపల్లి శ్రీను, వంగ శ్రీనివాస్‌రెడ్డి, రాధాకృష్ణ, కరుణాకర్ రెడ్డి, రాము, లక్ష్మణ్, ఆనంద్, రోహిణి, పరమేశ్వరి, సంగీత, భాగ్యలక్ష్మి, దయానంద్, సోమేశ్వర్, సురభి ప్రవీణ్, నాయకం ప్రసాద్, విజయభాస్కర్, కోల రాజు, తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో ఘనంగా తెప్పోత్సవం



మిరుదొడ్డిలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

మిరుదొడ్డి, జనవరి 17: మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బుధవారం సీతారామచంద్రస్వామి ఆలయంలో తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మిరుదొడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు గోదారంగనాయకుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజగోపాలచారి, రాజులు తదితరులున్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం .. తల్లీ బిడ్డ క్షేమం



మెరుగైన చికిత్స కోసం తల్లీ బిడ్డను చేర్యాల ఆస్పత్రికి తరలించిన 108 సిబ్బంది

మద్దూరు, జనవరి 17: ఓ గర్భిణిని ప్రసవం కోసం 108 అంబులెన్సులో తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవం జరిగింది. ఈ సంఘటన మద్దూరు మండలం లద్నూరు గ్రామంలో చోటు చేసుకున్నది. 108 సిబ్బంది ఈఎంటీ సుల్తాన్‌రాజు, పైలెట్ రామచంద్రం తెలిపిన వివరాల ప్రకారం.. లద్నూరు గ్రామానికి చెందిన గుర్రా భవానికి పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన 108 సిబ్బంది అంబులెన్సులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువై అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవం జరిగి, పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిందన్నారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు. చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ఆపద సమయంలోనైనా 108 అంబులెన్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, కోఆర్డినేటర్ కుమారస్వామి సూచించారు.

అక్రమంగా పట్టాను మార్చేశారు

- కోడలిపై వృద్ధురాలి ఫిర్యాదు



తహసీల్ కార్యాలయం ఆవరణలో మీనాక్షమ్మ ఆందోళన

చేర్యాల, జనవరి 17: చేర్యాల రెవెన్యూ అధికారులు లంచం తీసుకుని తనకు చెందాల్సిన భూమిని కోడలు పేరిట అక్రమంగా పౌతీ పట్టా మార్పిడి చేశారంటూ ఓ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన కొల్ల మీనాక్షమ్మ బుధవారం తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టింది. బాధితురాలి వివరాల ప్రకారం.. తన భర్త సిద్ధారెడ్డికి 12 ఎకరాల భూమి ఉండగా.. అతడి మరణానంతరం కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి పేరిట పట్టా చేయించింది. గతంలో చేసిన అప్పులకు తన పేరిట ఉన్న 3 ఎకరాల భూమిని విక్రయించి అప్పులు తీర్చానని, కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి కూడా చనిపోయిన అనంతరం కోడలు తార తనకు తెలియజేయకుండా ముందస్తుగా 9ఎకరాల భూమిని విక్రయించిందన్నారు. తనను పోషించకుండా వ్యవహరిస్తున్న విషయమై గ్రామ పెద్దలను ఆశ్రయించడంతో మిగతా మూడెకరాల భూమిని తన పేరిట కొనసాగించాలని తీర్మానించారని తెలిపింది. కానీ అధికారులను కలిసి మూడెకరాల భూమిని తన పేరిట అక్రమంగా పౌతీ మార్పిడికి దరఖాస్తు చేసుకున్న విషయం తెలియడంతో నిలిపివేయాలని తాను అధికారుల చుట్టూ తిరుగుతున్నానని, అయినా ఏమాత్రం పట్టించుకోకుండా గుట్టుచప్పుడు కాకుండా బుధవారం కోడలు పేరిట పట్టా మార్పిడి చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరింది. అనంతరం కోడలు తారపై చర్యలు తీసుకోవాలని చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఈ విషయమై తహసీల్దార్ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ భూవివాదానికి సంబంధించి మీనాక్షమ్మ తన వద్దకు రెండునెలల క్రితం వచ్చిందని, వారసత్వ ధ్రువీకరణ పత్రం తీసుకువస్తే పట్టా మార్పిడి చేస్తానని తెలిపానన్నారు. కానీ ఆమె కోడలు తార వారసత్వ ధ్రువీకరణ పత్రం దాఖలు చేయడంతో భర్త భూమిని భార్య పేరిట మార్పిడి చేయాల్సిన నిబంధన ఉండటంతో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చేసిన విచారణ ప్రకారం పౌతీ మార్పిడి చేశామని విలేకరులకు తెలిపారు.

పీఆర్ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కొండపాక, జనవరి 17: తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రూపొందించిన క్యాలెండర్‌ను సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ర్యాగల్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన డీపీవోకు వినతి పత్రం అందజేశారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి సమ్మె కాలం జీతాలు ఇవ్వాలని, సిబ్బందికి అందరికి ప్రమాదబీమా వర్తించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మేకల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి సీపీ కనకయ్య, కోశాధికారి బ్రాహ్మణులపల్లి పరశురాములు, జిల్లాల నుంచి వచ్చిన పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీపీవో

పరిపాలన సౌలభ్యం కోసమే పక్కా భవనాలు



నూతన పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

మద్దూరు, జనవరి 17: నూతన గ్రామ పంచాయతీలకు పక్కాభవనాల ఏర్పాటుతోనే గ్రామపరిపాలన సజావుగా సాగుతుందని సర్పంచ్ వుట్ల రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మద్దూరు మండలం ధర్మారం గ్రామంలో పాలకవర్గ సభ్యులతో కలిసి నూతన గ్రామపంచాయతీ భవన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పంచాయతీ సెక్రటరీ అశోక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సర్పంచ్‌ల పదవీ కాలం ఈ నెల 31తో పూర్తి కానున్న నేపథ్యంలో పనులను వేగవంతంగా పూర్తి చేయించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొల్లం జయాకర్, వార్డు సభ్యులు బొంగురం వెంకటలక్ష్మి, చిలుముల బుచ్చమ్మ, చెవిటి కరుణాకర్, కొండూరి పరశురాములు, బొంగురం బాల్‌రెడ్డి, నాగిళ్ల అపర్ణ, గంధమాల గంగమ్మ, సెక్రటరీ బస్వరాజు అశోక్‌తో గ్రామస్థులు పాల్గొన్నారు.

రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ ప్రత్యేక పుస్తకావిష్కరణ



రామ్ లల్లా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

గజ్వేల్ రూరల్/గజ్వేల్ టౌన్, జనవరి 17: ఈ నెల 22న జరిగే అయోధ్య రాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో బుధవారం గజ్వేల్‌లో శ్రీ మురళీకృష్ణ ఆలయంలో అయోధ్య ట్రస్టు జిల్లా అధ్యక్షుడు సామాజిక సమరత రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌బాబు ఆధ్వర్యంలో అయోధ్య 500 ఏళ్ల చరిత్రకు సంబంధించిన రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ ప్రత్యేక సంచిక, పుస్తకాలకు పూజలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్ని భక్తి గేయాలు ఆలపించారు. అనంతరం ఆ పుస్తకాలను ఎమ్మెల్సీ యాదవరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రామచంద్రం, సభ్యులు ఉప్పల వెంకటేశం, మైత్రాములు, లక్ష్మయ్య, శివకుమార్, బండి శ్రీనివాసు, ధార రాంచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మూరిపై విమర్శలు మానుకోవాలి: కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చిరంజీవులు

చేర్యాల, జనవరి 17: గెలుపు, ఓటములతో నిమిత్తం లేకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై సీపీఎం నాయకులు చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలని, రాజకీయ స్వార్థం వీడి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కాంగ్రెస్‌పార్టీ చేర్యాల పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం నాయకుల తీరు చూస్తుంటే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిలాగే ఉందన్నారు. చేర్యాల పెద్దచెరువు సుందరీకరణ బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిలిచిన విషయం తెలిసినా సీపీఎం నాయకులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై అర్థరహిత విమర్శలు చేయడమెందుకని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కుమ్మక్కై కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేసినా ప్రజలు హర్షించబోరన్నారు. సమావేశంలో నాయకులు దాసరి శ్రీకాంత్, సంజీవులు, మల్లేశం, ఉపేందర్, భాస్కర్, దామోదర్, బుచ్చిరాములు, నాగరాజు, రమేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.